సర్కారు బడి.. విప్లవాత్మక ప్రగతి

దేశ భవిష్యత్తు రూపుదిద్దుకునేది తరగతి గదుల్లోనే అన్న విద్యావేత్తల అభిప్రాయాన్ని దృఢంగా విశ్వసించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారు. మౌలిక వసతులతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా డిజిటల్ తరగతులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు.



స్మార్ట్ బెంచీలపై కూర్చుని పాఠాలు వింటున్న చిన్నారులు

- శివాజీపాలెం ప్రాథమిక పాఠశాలలో సకల వసతులు
- నాడు–నేడు కింద రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు నౌకానగర్–శివాజీపాలెం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నాడు–నేడు తొలి దశలో రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో అత్యంత అవసరమైన రెండు బోర్లు వేయించారు. వీటితో పాటు ఎలక్ట్రికల్ పనులు, బెంచీలు, ఫ్యాన్‌లు, వాటర్ ట్యాంక్, ఇంగ్లిష్ ల్యాబ్, టేకు తలుపులు, స్టెయిన్ లెస్ స్టీల్ తలుపులు, గోడపై బార్బ్‌డ్‌వైర్‌తో పటిష్ట రక్షణ ఏర్పాటు చేశారు. ప్లంబింగ్ పనులు, టైల్స్ మరమ్మతులు కూడా చేపట్టారు. పాఠశాల గోడలపై అందమైన బొమ్మలు సైతం వేయించారు. తరగతి గదుల్లో అందమైన బెంచీలు, స్మార్ట్ టీవీలు, గ్రీన్ బోర్డులు, గోడలపై ఆహ్లాదకరమైన బొమ్మలు చిన్నారుల మనసులను దోచుకుంటున్నాయి. దీంతో చిన్నారులు పాఠశాలకు రావడానికి ఆసక్తి కనబరుస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. టాయిలెట్స్, నీటి వసతికి శాశ్వత పరిష్కారం లభించింది. టాయిలెట్స్ బ్లాక్, విశాలమైన ఆట స్థలం ఉన్నాయి.



టైల్స్, తలుపులు వేసిన తరువాత పాఠశాల భవనం



నూతనంగా ఏర్పాటు చేసిన బెంచీలు, టైల్స్

ఇది కదా అభివృద్ధి

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 184 | 7 తరగతి గదులు | బోధన సిబ్బంది 7 | 2 సహాయక సిబ్బంది



ఆధునికీకరించిన టాయిలెట్స్

నాడు–నేడులో చేసిన పనుల వివరాలు

టైల్స్ కోసం రూ.1.11 లక్షలు	30 బెంచీల కోసం రూ.2.04 లక్షలు
పాఠశాల నేమ్ బోర్డులకు రూ.65 వేలు	పది ఫ్యాన్లకు 14,400
స్టీల్ డోర్లు రూ.66 వేలు	రెండు బోర్లు వేయడానికి రూ.1.26 లక్షలు
కాంపౌండ్ వాల్ రూ.81 వేలు	ఇంగ్లిష్ ల్యాబ్ రూ.37 వేలు
కార్పెంటర్ వర్క్స్‌కి రూ.15 వేలు	స్మార్ట్ టీవీలు 5
టాయిలెట్స్ మరమ్మతులకు రూ.32 వేలు	

నీటి సమస్య తీరింది..

పాఠశాలకు బోరు లేకపోవడంతో నీటి సమస్య ఉండేది. నాడు–నేడు పథకంలో భాగంగా మంజూరైన నిధులలో బోర్లు వేయడం, భవనంపై ట్యాంక్ ఏర్పాటు చేశాం. టాయిలెట్స్‌ని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాం. కొత్త బెంచీలు, గ్రీన్ బోర్డుల ఏర్పాటు, పాఠశాల రక్షణ గోడ పటిష్టం చేయడం, గేట్లు పెట్టడం సాధ్యపడింది.

– బి.కృష్ణ దుర్గాకుమారి, హెచ్‌ఎం, శివాజీపాలెం పాఠశాల

ప్రైవేటు స్కూల్ నుంచి ఇక్కడికొచ్చాను..

గతంలో ప్రైవేటు పాఠశాలలో చదివేవాడిని. శివాజీపాలెం ప్రభుత్వ పాఠశాలలో వసతులు బాగున్నాయి. దీంతో ఈ పాఠశాలలో చేరాను. పాఠాలు బాగా చెబుతున్నారు. ఆట వస్తువులు, ఆట స్థలం కూడా మా పాఠశాలలో ఉంది. రేడియో కార్యక్రమాలలో సైతం మేము పాల్గొంటున్నాం.

– వి.అఖిల్, ఐదో తరగతి విద్యార్థి

క్లుప్తంగా

ఎస్‌–3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారిణికి పతకాలు



బంగారు పతకాన్ని అందుకుంటున్న మన్నా మనోజ్

ఎంవీపీ కాలనీ: స్థానిక ఎస్‌–3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారిణికి స్విమ్మింగ్‌లో 5 పతకాలు లభించాయి. ఇటీవల నరసరావుపేటలో జరిగిన 9వ సబ్ జూనియర్ అండ్ సీనియర్ వింటర్ అక్వాటిక్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లో స్విమ్మింగ్ క్రీడాకారిణి మన్నా మనోజ్ వివిధ కేటగిరిల్లో పోటీలో పాల్గొని సత్తాచాటారు. 1500 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకం సాధించడంతో పాటు 50మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో సిల్వర్ మెడల్స్ సాధించారు. దీంతో పాటు 200 మీటర్ల ఐఎంలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకులు, కోచ్‌లతో పాటు నగర క్రీడా ప్రముఖులు.. మన్నా మనోజ్‌కు అభినందనలు తెలిపారు.

నీటి సమస్యలు రానీయొద్దు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చూడాలని జీవీఎంసీ అధికారులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కోరారు. ఆదివారం వార్డులో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది నీరు, డ్రైనేజీ సమస్యలను విన్నవించుకున్నారు. వాటిపై ఆయన వెంటనే స్పందించి జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి సమస్యలు వివరించి, పరిష్కరించాలని కోరారు. ఈ పర్యటనలో పార్టీ నాయకులు బి.వెంకటరావు, సతీష్, బొట్టా నాగ, వంకర మహీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్, మహ్మద్ షైకూన్ హనుమంతవాక నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై ఆరిలోవ వెళ్తున్నారు. విమ్స్ కూడలి వద్ద మితిమీరిన వేగంతో ఫుట్‌పాత్ గోడను ఢీకొట్టారు. దీంతో కిందపడిన ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రోగుల సహాయకులకు పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: నెలవారీ సేవా కార్యక్రమంలో భాగంగా మానసిక ఆస్పత్రిలో రోగుల సహాయకులకు యోగా ట్రీ సంస్థ సభ్యులు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.రాజు, రామరాయులు, సర్కార్, ఏఐసీ ప్రకాష్, బలరామ రాజు, బలరామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

రెడ్‌క్రాస్ సెక్రటరీ రవి కుమార్



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న రవికుమార్

విశాఖ విద్య: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి పి. రవికుమార్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ వద్ద మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. అలాంటి వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నగరంలోని ప్రత్యేక రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కాలేజీ యాజమాన్యాలు రక్తదానంపై అవగాహన కల్పించేలా చొరవ చూపాలన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకొస్తే తామే ప్రత్యేక వాహనంతో అక్కడికి వెళ్లి సేకరిస్తామన్నారు. మమత చారిటబుల్ సంస్థ నిర్వాహకురాలు ఎల్లేటి మమతను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సీ సెక్రటరీ రాజాన ప్రసాద్, మమత చారిటబుల్ సంస్థ ఫౌండర్ ఎల్లేటి మమత, మురళీ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న టీటీడీ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ

ఎంవీపీ కాలనీ : భగవద్గీతలోని శ్లోకాల కంఠస్థ పోటీల్లో విజేతలుగా నిలిచిన నగర యువతకు టీటీడీ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ బహుమతులు అందజేశారు. కర్మయోగం, సంపూర్ణ భగవద్గీతపై ఆదివారం టీటీడీ ఆవరణలో నాలుగు కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఆయా కేటగిరీల్లో తొలి మూడు స్థానాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. కర్మయోగంపై నిర్వహించిన పోటీల్లో 6, 7 తరగతుల కేటగిరిలో ప్రథమ స్థానంలో ఎస్.సమన్వత, ద్వితీయ స్థానంలో ఎం.శ్రీనిజ, తృతీయ స్థానంలో శ్యామినీ హిరణ్య విజేతలుగా నిలిచారు. 8, 9 తరగతుల కేటగిరిలో ప్రథమ స్థానంలో కొత్తపల్లి మోక్షిత్, ద్వితీయ స్థానంలో సురకత్తుల నాగదిలీప్ బహుమతులు అందుకున్నారు. సంపూర్ణ భగవద్గీతపై 18 ఏళ్ల కేటగిరిలో జె.శివకుమారి, పి.లీల విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సత్యకుమార్, రమాదేవి, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకల పరిరక్షణతో పర్యావరణ సమతుల్యత



వరికంకులను పంపిణీ చేస్తున్న చిరంజీవి చౌదరి

ఏయూ క్యాంపస్: ప్రకృతిలో అత్యంత విలువైన చిన్న జీవి పిచ్చుకను కాపాడి పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఆర్గానిక్ మేళాలో భాగంగా సత్వ ఆర్గానిక్స్ నిర్వహించిన వరికంకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులకు దగ్గరగా జీవించే పక్షులకు ఆహారాన్ని అందిస్తూ వాటిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐ మాజీ జేసీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పక్షుల పట్ల ప్రేమతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సత్వ నేచురల్స్ అధినేత వి.మధుసూదనరెడ్డి, మేళా నిర్వాహకులు పాల్గొన్నారు.

యాదవులకు సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట



మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

బీచ్ రోడ్డు: గడిచిన నాలుగున్నరేళ్లలో యాదవ సామాజిక వర్గ అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని విశాఖ జిల్లా యాదవ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా యాదవులకు తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. చంద్రబాబు తనయుడు నారా లోకేష్ తమ పార్టీ గెలిస్తే యాదవులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో తిరుపతిలోని తొలిదర్శనాన్ని రద్దు చేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దానిని చట్టం చేసి ఆ ప్రాంతానికి యాదవ సన్నిధిగా నామకరణం చేశారని గుర్తు చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చైర్మన్‌ల పదవులు ఇచ్చారన్నారు. నగర ప్రథమ మహిళ మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో పాటు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్ పర్సన్, 13 కార్పొరేటర్ల పదవులను యాదవులకు కేటాయించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. తమ చిరకాల వాంఛ అయిన యాదవ సామాజిక భవన నిర్మాణానికి ఎండాడ సమీపంలో సుమారు రూ. 25 కోట్ల విలువైన 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. జిల్లా యాదవ సామాజికవర్గం అంతా వైఎస్సార్‌సీపీతోనే ఉంటామన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో 20వ వార్డు కార్పొరేటర్ నక్కెళ్ల లక్ష్మి, 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాఖ విద్య: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మర్రిపాలెం ఈఎస్ఐ వైద్యుడు కేవీఎస్ గౌరీశ్వరరావు సూచించారు. ఈఎస్ఐ ఆస్పత్రి ద్వారా కార్మికులకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తున్నామన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో గతంలో కన్నా వసతులు బాగా మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు చూడొచ్చన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో నాణ్యమైన మందులు ఉన్నాయని, అవసరమైన కార్మికులు తగిన గుర్తింపు కార్డుతో వచ్చి సేవలు పొందాలన్నారు.

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ త్రినాథరావు

బీచ్ రోడ్డు: నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని రౌడీషీటర్లకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు సూచించారు. ఎంవీపీ కాలనీలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం ఆవరణలో ఆదివారం నగరంలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఏ ఒక్కరూ నేరప్రవృత్తిని కలిగి ఉండరాదన్నారు. నగరంలో చోటు చేసుకొనే సంఘటనల్లో రౌడీషీటర్ల పాత్ర ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కౌన్సెలింగ్‌కు ఎవరూ గైర్హాజరు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టాస్క్‌ఫోర్స్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 13వ వార్డులో 3వ రోజు విస్తృత పర్యటన



వెర్నిదుర్గానగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: నియోజకవర్గంలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేస్తున్నట్లు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో శుక్రవారం ప్రారంభమైన పాదయాత్ర మూడో రోజుకు చేరుకుంది. ఆదివారం విష్ణుపురికాలనీ, వెర్నిదుర్గానగర్, దుర్గాబజార్‌లలో కార్పొరేటర్ కెల్ల సునీత, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎంపీ ఎంవీవీ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. వాటి ద్వారా ఎలాంటి లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వార్డులో ప్రియదర్శిని కాలనీ నుంచి లక్ష్మీనగర్ వరకు ఉన్న గెడ్డ శిథిలావస్థకు చేరడంతో ఎదురవుతున్న సమస్యల గురించి స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే ఆ గెడ్డ ఆధునికీకరణ కోసం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి అంచనా వేయించారు. త్వరలో గెడ్డ పనులు చేయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి మంచి ఆదరణ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, శిరీష, ఆర్.ఎస్.నాయుడు, పోలారావు, వెంకటరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆత్మీయ సత్కారం



పెన్షనర్లను సత్కరిస్తున్న వీసీ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధనేతర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆలిండియా పెన్షనర్ల డేను ఘనంగా నిర్వహించారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా పాల్గొని 75 సంవత్సరాలు వయసు కలిగిన పెన్షనర్లను సత్కరించారు. విశ్వవిద్యాలయానికి సుదీర్ఘ కాలం సేవలు అందించిన వారిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గొలగాని అప్పారావు, సన్మాన కమిటీ చైర్మన్ తాళ్లూరి సైదయ్య, జనరల్ సెక్రటరీ సి.నాగశేఖరరెడ్డి, కోశాధికారి ఎస్.కె.అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు



భాస్కరరెడ్డికి ఏర్పాట్లను వివరిస్తున్న దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఆరోజు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చందనోత్సవంలో ప్రముఖులకు సరైన ఏర్పాట్లు చేయలేదన్న అపవాదు రావడంతో ఈసారి ముక్కోటి ఏకాదశికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రముఖుల దర్శనాల క్యూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వీఐపీలు దర్శనానికి వచ్చినప్పుడు దేవస్థానం, రెవెన్యూ అధికారుల మధ్య లైజనింగ్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినగదిలి తహసీల్దార్ రమణయ్య, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో పాలూరి నరసింగరాజు పాల్గొన్నారు.

రెండు పుస్తకాల ఆవిష్కరణ

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమంచి వినయ భూషణరావు రచించిన 'కథా బృందావనం', 'చిత్ర కవితా సరం' పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆచార్య కోలవెన్ను బాలమోహన్‌దాస్ ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. జె.పి.శర్మ పుస్తకాలను సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ అండ్ లోకల్ క్రిస్టియన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం కేఆర్ఎం కాలనీలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు క్రీస్తు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. ఈ వేడుకల్లో ప్రసంగీకులుగా తాడేపల్లి గూడెంకు చెందిన గాబ్రియేల్ సాల్మన్ వ్యవహరించగా.. జార్జ్ ముల్లోర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

అలరించిన వినోద వల్లరి

మహారాణిపేట: విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్ నిర్వహించిన వినోద వల్లరి అలరించింది. విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. హాస్యరత్న వేముల భాస్కరాచారి, కుమారి మల్లిక, తాళాభక్తుల లక్ష్మీప్రసాద్, సరగడ చిన్నరెడ్డి, పద్మ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు, జోకులు, పేరడీ సాంగ్స్, జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమ ప్రారంభానికి ముందు అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజును క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

అయ్యో.. పాపం

- వృద్ధుడిని వదిలించుకున్న కన్న పిల్లలు
- ఆదుకున్న జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది



వృద్ధుడిని ప్రశ్నిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: వయసులో ఉన్నప్పుడు సంపాదించాడు. పిల్లలను పెంచి, పెద్ద చేశాడు. వారికి పెళ్లిళ్లు కూడా చేశాడు. ప్రస్తుతం ఆయన వయసు మళ్లింది. వయోభారంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో పిల్లలు వదిలించుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట రాత్రి సమయంలో ఆ వృద్ధుడిని తీసుకువచ్చి జగదాంబ జంక్షన్‌లో సీఎంఆర్ జ్యువెలరీ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. రెండు రోజులుగా చలిలో కదల్లేని స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడి విషయాన్ని తెలుసుకున్న భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, తన సిబ్బందితో వెళ్లి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతనికి సపర్యలు చేసిన అనంతరం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనది విజయనగరం గంట స్తంభం ప్రాంతమని ఆ వృద్ధుడు తెలియజేశారు